
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం, 30, ఏప్రిల్, 2024



సోమశిలలో 8.21 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 8.212 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పెన్నా డెల్టాకు 200 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.74,760
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,678
3శాతం జీఎస్టీతో	రూ.6,878
నవర (8గ్రాములు)	రూ.55,024



నిబంధనలు తుంగలో..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కోనేటిమిట్టలో ప్రచారాన్ని టీడీపీ నేతలు నిర్వహించారు. నిబంధనలను ఉల్లంఘిస్తూ 40 /2 ఆశ వర్కర్ రామలక్ష్మి ప్రచారంలో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీ నెల్లూరు లోక్‌సభ పరిశీలకుడిగా విష్ణు



విష్ణువర్ధన్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని నియమించారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనను సోమవారం విడుదల చేసింది.

రైతులకు ఇబ్బందులు తలెత్తకూడదు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రైతులకు విద్యుత్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకూడదని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో విలేకరుల సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే నిర్దేశించిన సమయంలోపు మార్చాలని సూచించారు. మరమ్మతులు చేపట్టే సమయంలో లైన్ క్లియరెన్స్ కోసం సంబంధిత డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఏఈల అనుమతి పొందాలని సూచించారు. పోలింగ్ బూత్‌లలో నిరంతర విద్యుత్‌ను అందించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



నెల్లూరు(దర్గామిట్ట): నెల్లూరు లోక్‌సభ స్థానానికి నామినేషన్లు వేసిన అభ్యర్థులకు ఎన్నికల గుర్తులను కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ వెల్లడించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గుర్తులను కలెక్టర్ కేటాయించారు. నెల్లూరు లోక్‌సభ స్థానంలో 14 మంది ఎన్నికల బరిలో ఉన్నారని చెప్పారు. సాధారణ పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్‌సింగ్ బదారియా, డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

డీసీపల్లిలో 699 పొగాకు బేళ్ల విక్రయం



మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 699 బేళ్లను సోమవారం విక్రయించామని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 834 బేళ్లు రాగా, ఇందులో 699 విక్రయం కాగా.. మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించామని చెప్పారు. 88,153 కిలోల పొగాకును విక్రయించగా, రూ.2,27,31,622 వ్యాపారం జరిగిందని పేర్కొన్నారు. గరిష్ఠ ధర కిలో ఒక్కింటికి రూ.292.. కనిష్ఠ ధర రూ.216.. మొత్తమ్మీద సగటు ధర రూ.257.86గా నమోదైందని వివరించారు. వేలానికి 18 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారన్నారు.

డిగ్రీ పరీక్షల్లో నలుగురి డీబార్

వెంకటాచలం: వీఎస్‌యూ పరిధిలోని అనుబంధ కళాశాలల్లో సోమవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబారయ్యారని పరీక్షల నిర్వహణాధికారి డాక్టర్ మధుమతి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన డిగ్రీ ఐదో, ఆరో సెమిస్టర్ పరీక్షలకు 7682 మందికి గానూ 6925 మంది హాజరయ్యారని చెప్పారు. మధ్యాహ్నం నిర్వహించిన నాలుగో సెమిస్టర్ పరీక్షకు 4992 మందికి గానూ 315 మంది గైర్హాజరయ్యారని వివరించారు.

రామనారాయణరెడ్డికి గ్లాస్ గుర్తు

అదేంది.. రామనారాయణరెడ్డికి గ్లాసు గుర్తు కేటాయించారా.. ఈ మతలబేమిటబ్బాననే సందేహం కలగక మానదు. అయితే దీన్ని కేటాయించింది ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డికి కాదండోయ్. అక్కడే స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో నిలిచిన ధనిరెడ్డి రామనారాయణరెడ్డికి గ్లాసు గుర్తు కేటాయించడంతో ఓట్లు ఎక్కడ చీలుతాయోననే ఆందోళన తమ్ముళ్లలో నెలకొంది.

– ఆత్మకూరు

ఆమే.. ఆర్థిక శక్తి

మహిళలు ఆర్థిక ప్రగతి సాధిస్తేనే సమాజ పురోభివృద్ధి సాధ్యమని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బలంగా భావించారు. తదనుగుణంగా 2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక వీరి ఆర్థిక స్వావలంబనకు విప్లవాత్మక చర్యలు చేపట్టారు. వివిధ సంక్షేమ పథకాలకు రూపకల్పన చేసి అక్కచెల్లెమ్మల మోములో ఆనందాన్ని నింపారు. సున్నా వడ్డీకే రుణాలు.. వైఎస్సార్ ఆసరా.. చేయూత.. జగనన్న తోడు.. ఇలా సంక్షేమ పథకాల ద్వారా నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తూ మహిళలను మహరాణులుగా మారుస్తున్నారు.



బ్యాంక్ లింకేజీ

సంవత్సరం	ఎస్‌హెచ్‌జీలు	లక్ష్యం (కోట్లల్లో)	రుణాలు పొందిన గ్రూపులు	మంజూరైన మొత్తం (కోట్లల్లో)
2015 - 16	24,808	544.56	19,914	543.95
2016 - 17	29,026	620.46	22,509	732.63
2017 - 18	24,314	553.11	25,189	684.38
2018 - 19	19,618	553.31	25,047	814.55
2019 - 20	35,318	819.75	33,408	1087.60
2021 - 22	23,449	883.41	24,552	1192.43
2022 - 23	25,731	1031.31	27,941	1273.59
2023 - 24	25,210	1009.53	26,723	1176.37

- మహిళాభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట
- స్వావలంబనకు వందల కోట్లలో రుణాలు
- సున్నా వడ్డీకే అందజేస్తూ భరోసా కల్పిస్తున్న వైనం
- అండగా నిలుస్తున్న ఆసరా, చేయూత, జగనన్న తోడు
- కుటీర పరిశ్రమల స్థాపనతో స్వశక్తి

నెల్లూరు(పొగతోట): మహిళలను మహరాణులను చేయాలనే సంకల్పంతో అనేక పథకాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. స్వయం సహాయక గ్రూపు (ఎస్‌హెచ్‌జీ) మహిళలకు ఏటా వందల కోట్లలో బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేసి ఈ మొత్తం ద్వారా వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా చర్యలు చేపట్టారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా సున్నా వడ్డీకే రుణాలను మంజూరు చేస్తూ ఆర్థిక స్వావలంబనకు బాసటగా నిలుస్తున్నారు.

రుణాల మంజూరులో నూతన విధానం

2023 – 24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 25,542 ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు రూ.1009.53 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాలను మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించగా, 26,723 గ్రూపులకు రూ.1176.37 కోట్ల రుణాలను మంజూరు చేసి లక్ష్యాన్ని సాధించారు. రుణాల మంజూరులో నూతన విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రారంభించారు. గ్రూపు రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలనూ మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. రూ.రెండు లక్షల నుంచి రూ.పది లక్షల వరకు వ్యక్తిగత రుణాలను మంజూరు చేశారు. మండలాల వారీగా అర్హులైన మహిళలను ఎంపిక చేసి వీరికి ఈ రుణాలు మంజూరయ్యేలా డీఆర్డీఏ, బ్యాంక్ అధికారులు చర్యలు చేపట్టారు.

ఉపాధికి బాట

డెయిరీలు, ఫ్లోర్ మిల్స్, పచ్చళ్ల తయారీ, పిండి మిల్లు, బ్యూటీషియన్, కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలను రూపొందించి అమలు చేశారు. మహిళలు దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి రుణాలను మంజూరు చేయడం ఇందులో ప్రత్యేకత. జిల్లా వ్యాప్తంగా సుమారు 38,875 వేల ఎస్‌హెచ్‌జీ గ్రూపుల్లో 4,00,504 మందికి సభ్యులుగా ఉన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వీరికి రుణాలను మంజూరు చేయడంలో వెనుకడుగేయడంలేదు. ఎస్‌హెచ్‌జీలను ప్రోత్సహిస్తూ వారితో మహిళా మార్టులు, ఆహా క్యాంటిన్లను ఏర్పాటు చేయించి అభివృద్ధికి ప్రభుత్వం బాటలేసింది.

నాడంతా అవస్థలే..

గత టీడీపీ హయాంలో ఎస్‌హెచ్‌జీలకు రుణాలను తక్కువగా మంజూరు చేసేవారు. ఆ సమయంలో ఏడాదికి వెయ్యి కోట్ల రుణాలు సైతం మంజూరు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. అయితే ప్రస్తుత ప్రభుత్వ చర్యలతో అక్కచెల్లెమ్మల్లో ఆనందం వ్యక్తమవుతోంది. డీఆర్డీఏ అధికారులు మహిళలకు సూచనలు, సలహాలిస్తూ వారి ఆర్థిక ప్రగతికి చర్యలు చేపడుతున్నారు.

సున్నా వడ్డీ

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	అందుకున్న మొత్తం (కోట్లల్లో)
2019 - 20	29,310	58.73
2020 - 21	32,894	50.75
2021 - 22	34,238	52.61
2022 - 23	33,869	40.26

వైఎస్సార్ ఆసరా

సంవత్సరం	గ్రూపుల సంఖ్య	మంజూరైంది (కోట్లల్లో)
2020 - 21	26,626	210.97
2021 - 22	27,004	213.32
2022 - 23	27,004	213.32
2023 - 24	27,081	214.00

వైఎస్సార్ చేయూత

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	అందించింది (కోట్లల్లో)
2020 - 21	1,04,597	196.12
2021 - 22	1,07,906	202.32
2022 - 23	1,43,521	269.09

స్త్రీ నిధి

సంవత్సరం	సభ్యులు	లక్ష్యం	మంజూరైన మొత్తం (కోట్లల్లో)
2020 - 21	22,625	102.22	109.61
2021 - 22	44,519	167.66	149.75
2022 - 23	33,175	179.62	113.18
2023 - 24	19,739	142	108.35

చేయూతతో అండగా..

వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున.. నాలుగేళ్లలో రూ.75 వేల సాయాన్ని ప్రభుత్వం అందించింది. దీని ద్వారా లబ్ధి పొందిన మహిళలు సుస్థిర జీవనోపాధిని ఏర్పాటు చేసుకొని ఆదాయ వనరులను పెంపొందించుకునేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిరు వ్యాపారాలు చేసుకుంటున్న 1,35,885 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు పథకం ద్వారా గడిచిన నాలుగేళ్లలో రూ.136.48 కోట్లను వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారు.

ఆదుకుంటున్న స్త్రీ నిధి రుణాలు

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలను బ్యాంక్ లింకేజీ, స్త్రీ నిధి రుణాలు ఆదుకుంటున్నాయి. పిల్లల చదువులు, వివాహాలు, ఇతర అవసరాలకు బ్యాంకుల ద్వారా తక్కువ వడ్డీకే రుణాలను పొందగలుగుతున్నారు. అవసరాలకు ఉపయోగించుకొని మిగిలిన నగదుతో చిన్న వ్యాపారాలు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. పేద మహిళలు ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులుగా ఉండటంతో ఎలాంటి ష్యూరిటీ లేకుండానే రుణాలను బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి.

పేపర్ ప్లేట్ల తయారీతో ఉపాధి



“స్వయం సహాయక గ్రూపులో సభ్యురాలిగా చేరి పొదుపు చేసుకుంటున్నా. ఇప్పటి వరకు ఎనిమిదిసార్లు బ్యాంక్ లింకేజీ రుణాలు పొందా. గతేడాది రూ.1.2 లక్షలు రుణం పొంది, పేపర్ ప్లేట్ల తయారీ యంత్రాన్ని ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నా. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.70 వేలు బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి.

– నాగరత్నమ్మ, చేజర్ల

ఆర్థిక ప్రగతి సాధించేలా చర్యలు



ఎస్‌హెచ్‌జీ మహిళలు ఆర్థిక ప్రగతి సాధించేలా చర్యలు చేపడుతున్నాం. నిర్దేశించిన లక్ష్యాలను వంద శాతం అధిగమించాం. స్త్రీ నిధి, ఆసరా, చేయూత లక్ష్యాలను వంద శాతం పూర్తి చేశాం. ఎస్‌హెచ్‌జీ మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇస్తూ చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించేలా చర్యలు చేపడుతున్నాం.

– సాంబశివారెడ్డి, పీడీ, డీఆర్డీఏ

నిబంధనలను విధిగా పాటించాలి

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్



మాట్లాడుతున్న హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నామినేషన్ల ప్రక్రియ విజయవంతంగా పూర్తయిందని, ఎన్నికల సంఘం నిబంధనలను అభ్యర్థులు తప్పక పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సమావేశాన్ని కలెక్టరేట్‌లోని శంకరన్ వీసీ హాల్లో కేంద్ర ఎన్నికల పరిశీలకుల సమక్షంలో కలెక్టర్ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల ప్రక్రియను పది మంది అబ్జర్వర్లు నిశితంగా పరిశీలిస్తున్నారని, నిబంధనలను విధిగా పాటించాలని కోరారు. కుల, మత ప్రస్తావన తేకూడదని, మతపరమైన ప్రదేశాల్లో ప్రచారం చేయొద్దని.. వ్యక్తిగతంగా ఎవర్నీ విమర్శించకుండా ప్రశాంత వాతావరణంలో ప్రచారాన్ని నిర్వహించాలని సూచించారు. ఎన్నికల వ్యయాలను విధిగా నమోదు చేయాలని చెప్పారు. నామినేషన్ల సమయంలో ఇచ్చిన బ్యాంక్ ఖాతా ద్వారానే లావాదేవీలను జరపాలని, రూ.పది వేల కంటే ఎక్కువ నగదును వినియోగించాలంటే చెక్కులు, అకౌంట్ ద్వారానే జరపాల్సి ఉంటుందన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను అభ్యర్థులు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. క్రిమినల్ కేసులున్న అభ్యర్థులు తమ కేసుల వివరాలను తెలుపుతూ పత్రికల్లో మూడుసార్లు ప్రకటనలను ఇవ్వాల్సి ఉంటుందన్నారు. పోస్టల్ బ్యాలెట్లను ఫెసిలిటేషన్ సెంటర్లలోనే వినియోగించుకునేలా ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, ఈ మేరకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. దివ్యాంగులు, 85 ఏళ్లు నిండిన వృద్ధుల అభ్యర్థన మేరకు ఇంటి వద్దే ఓటేసేలా ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. దీనికి గానూ జిల్లాలో 1712 మందిని గుర్తించామని వెల్లడించారు.

సమస్యలను తెలపండి

ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి సమస్య ఉన్నా, తమ దృష్టికి తీసుకురావాలని అభ్యర్థులకు కేంద్ర ఎన్నికల పరిశీలకులు రామ్‌కుమార్ గౌతమ్, నితిన్‌సింగ్ బదారియ సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి మేరకు నడుచుకోవాలని సూచించారు.

బ్యాంక్ ఖాతాల్లో పింఛన్లు

- ఒకటో తేదీన జమ
- 3,15,423 మంది లబ్ధిదారులకు రూ.94.38 కోట్లు

నెల్లూరు(పొగతోట): ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు మే, జూన్‌కు సంబంధించిన పింఛన్ నగదును లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో ఒకటో తేదీన జమచేయనున్నామని డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగదు పంపిణీ ప్రక్రియ మే ఒకటి నుంచి ఐదు వరకు జరగనుందని వివరించారు. ఆధార్ నంబర్‌తో మ్యాప్ చేసిన అకౌంట్‌కు ఈ మొత్తాన్ని డీబీటీ పద్ధతి ద్వారా జమచేయనున్నామని వివరించారు. బ్యాంక్ ఖాతాల్లేని వారు, దివ్యాంగులు, కదల్లేని లబ్ధిదారులు, ఆరోగ్య, సైనిక సంక్షేమ పింఛన్లను ఇంటికొచ్చి సిబ్బంది అందజేయనున్నారని వెల్లడించారు. 2,35,689 మంది లబ్ధిదారులకు రూ.70,70,73,000 నగదును వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేయనున్నారన్నారు. 79,734 మంది లబ్ధిదారుల ఇంటికెళ్లి పింఛన్ నగదును అందజేయనున్నారని పేర్కొన్నారు. ఖాతాల్లో నగదు జమ విఫలమైతే ఐదో తేదీలోపు ఇంటి వద్దకొచ్చి అందజేయనున్నారని చెప్పారు. పింఛన్ కోసం ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ, వార్డు సచివాలయాలకు వెళ్లొద్దని విజ్ఞప్తి చేశారు.

రూ.49.97 లక్షల పట్టివేత

నెల్లూరు(క్రైమ్): ఎన్నికల నేపథ్యంలో రైల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.49.97 లక్షల నగదును రైల్వే, ఆర్పీఎఫ్ పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. హైదరాబాద్‌కు చెందిన కుమార్, జిల్లాకు చెందిన ప్రవీణ్ స్నేహితులు. వీరు వందేభారత్‌లో నెల్లూరొచ్చారు. రైల్వే, ఆర్పీఎఫ్ ప్రత్యేక బృంద తనిఖీల్లో భాగంగా వీరి వద్ద బ్యాగ్‌ను తనిఖీ చేయగా, రూ.49,97,400ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరులో స్థలాన్ని కొనుగోలు చేసే నిమిత్తం నగదును తీసుకెళ్తున్నామని వారు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న నగదును ఐటీ అధికారులకు రైల్వే పోలీసులు అప్పగించారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

- లోక్‌సభకు 14 మంది
- అసెంబ్లీకి 115 మంది అభ్యర్థులు బరిలో

నెల్లూరు(దర్గామిట్ట): నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. జిల్లాలోని ఎనిమిది అసెంబ్లీ స్థానాలకు 115 మంది.. నెల్లూరు లోక్‌సభ స్థానానికి 14 మంది బరిలో ఉన్నారు.

నియోజకవర్గం	నామినేషన్ వేసిన వారు	తిరస్కరణకు గురైంది	ఉపసంహరణ	బరిలో నిలిచింది
నెల్లూరు లోక్‌సభ	21	06	01	14
సర్వేపల్లి	17	04	--	13
నెల్లూరు రూరల్	13	01	01	11
నెల్లూరు సిటీ	26	08	03	15
కావలి	25	10	02	13
కందుకూరు	25	01	02	22
ఉదయగిరి	22	06	01	15
కోవూరు	28	09	06	13
ఆత్మకూరు	15	02	--	13
మొత్తం	171	41	15	115

గ్లాసుతో సైకిల్‌కు గుబులు

- కావలిలో పసుపులేటి సుధాకర్‌కు గాజు గుర్తు కేటాయింపు
- టీడీపీ రెబల్‌గా, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో..
- ఓట్లు చీలుతాయనే ఆందోళనలో కావ్య

వరుస షాకులతో కొట్టుమిట్టాడుతున్న టీడీపీకి కావలిలో మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీ రెబల్ అభ్యర్థిగా, ఇండిపెండెంట్‌గా బరిలో నిలిచిన పసుపులేటి సుధాకర్ పక్కలో బల్లెంలా తయారయ్యారు. పోటీలో ఆయన ఉండటంతో ఓట్లు భారీగా చీలుతాయనే ఆందోళనతో ఉన్న కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డికి తాజా పరిణామం అశనిపాతంలా పరిణమించింది. సుధాకర్‌కు అనూహ్యంగా జనసేన గాజు గ్లాస్ గుర్తు లభించడంతో కావ్య శిబిరం ఒక్కసారిగా డీలాపడిపోయింది.



కావలి: టీడీపీ రెబల్‌గా, స్వతంత్ర్య అభ్యర్థిగా కావలి నుంచి రంగంలోకి దిగిన పసుపులేటి సుధాకర్‌కు ఎన్నికల కమిషన్ గ్లాస్ గుర్తును కేటాయించడంతో టీడీపీ శిబిరంలో కలకలం రేగింది. ఈ పరిణామంతో ఓట్లు భారీగా చీలిపోతాయనే భయంతో కావ్య శిబిరం ఒక్కసారిగా కుదుపునకు గురైంది.

బీసీల ప్రతినిధిగా రాజకీయాల్లోకి..

బీసీల ప్రతినిధిగా.. పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కావలి రాజకీయాల్లో పసుపులేటి సుధాకర్ అడుగుపెట్టారు. 2019 ఎన్నికల్లో జనసేన తరఫున గ్లాస్ గుర్తుపై పోటీ చేసి ఓడిపోయారు. అనంతరం బీజేపీలో చేరి కొంతకాలం రాష్ట్ర పదవిలో కొనసాగారు. ఈ క్రమంలో ఆయన్ను టీడీపీ అధినేత చంద్రబాబు పిలిపించుకొని కావలిలో పార్టీ కోసం పనిచేయాలని కోరారు. ఈ తరుణంలో బీజేపీకి రాజీనామా చేసి టీడీపీ కోసం పనిచేశారు. చంద్రబాబు అరెస్ట్ సమయంలో సుధాకర్ తన వర్గీయులతో నిరసన ప్రదర్శనలతో పాటు రాజమహేంద్రవరంలో ర్యాలీలను చేపట్టారు. దీంతో కావలి టీడీపీ టికెట్ సుధాకర్‌కేనని అందరూ భావించారు. అప్పటి వరకు కావలి ఇన్‌చార్జిగా ఉన్న మాలేపాటి సుబ్బానాయుడు సైతం సుధాకర్ అభ్యర్థిత్వాన్ని బలపర్చారు.

రెబల్‌గా పోటీకి సై..

ఈ తరుణంలో కావ్య కృష్ణారెడ్డి ఆర్థిక బలంతో కావలి టికెట్‌ను దక్కించుకున్నారు. నియోజకవర్గంలోని సీనియర్ నేతలు, కేడర్ తీవ్రంగా వ్యతిరేకించినా, ఆయనవైపే చంద్రబాబు మొగ్గు చూపారు. దీంతో కంగుతిన్న పసుపులేటి సుధాకర్ కావలిలో రెబల్‌గా పోటీ చేసేందుకు డిసైడయ్యారు. ట్రస్ట్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు, టీడీపీ, జనసేన కేడర్ అండగా నిలుస్తుందనే నమ్మకంతో సొంత మేనిఫెస్టోను రూపొందించుకొని బరిలోకి దిగారు. దీంతో టీడీపీ, జనసేన నేతలు, పవన్ కల్యాణ్ అభిమానులు సైతం పసుపులేటికి మద్దతు తెలిపి ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో సుధాకర్‌కు గ్లాస్ గుర్తు కేటాయించడంతో ఆయన వర్గీయుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

భగ్గుమంటున్న కావ్య

పసుపులేటి సుధాకర్‌కు గ్లాస్ గుర్తు కేటాయించడంతో కావ్య కృష్ణారెడ్డికి మైండ్ బ్లాకైంది. ప్రెస్‌మీట్ పెట్టి మరీ పసుపులేటిపై తిట్ల దండకం అందుకున్నారు. ఆయనపై ఎనిమిది కేసులున్నాయని, 420 అంటూ నోరుపారేసుకున్నారు. ప్రతాప్‌కుమార్‌రెడ్డి, పసుపులేటి సుధాకర్ ఇద్దరూ కలిసి తనపై పోటీకి దిగారని ఆరోపించారు.

గోదాములో అగ్నిప్రమాదం

- పక్క దుకాణాలకూ వ్యాపించిన మంటలు
- రూ.40 లక్షల ఆస్తినష్టం



ఘటన స్థలంలో అగ్నిమాపక సిబ్బంది

నెల్లూరు(క్రైమ్): నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు, హాస్పిటళ్లు, దుకాణాల మధ్య రేకుల షెడ్‌లో ఏర్పాటు చేసిన ఓ గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. ఆక్వా రంగానికి చెందిన ప్లాస్టిక్, ఇతరత్రా వస్తువులను ఉంచడంతో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. పక్కనున్న దుకాణాలకు వ్యాపించాయి. సకాలంలో అగ్నిమాపక సిబ్బంది సాహసోపేతంగా శ్రమించి మంటలను ఆర్పేసిన ఘటన విజయమహల్ గేట్ సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. అగ్నిమాపక అధికారుల వివరాల మేరకు.. విజయమహల్ గేట్ సమీపంలో ఆక్వారంగానికి చెందిన ప్లాస్టిక్ నెట్‌లు, థర్మాకోల్ షీట్లు, బోట్లు, పట్టలు, నైలాన్ రోప్స్ తదితర వస్తువుల గోదామును నగరానికి చెందిన హరీష్ నిర్వహిస్తున్నారు. గోదాముకు ముందు వైపు ఫర్నిచర్, పండ్ల దుకాణాలు ఉన్నాయి. ఈ క్రమంలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా గోదాములో అగ్నిప్రమాదం సంభవించింది. గోదాము నుంచి దట్టమైన పొగలు రావడాన్ని గమనించిన ఫర్నిచర్, పండ్ల దకాణాల్లోని సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ప్లాస్టిక్, థర్మాకోల్ వస్తువులు ఉండటంతో మంటలు ఉవ్వెత్తున ఎగసిపడటంతో సమీపంలోని ఇళ్ల వారు, గోదామును ఆనుకొని ఉన్న ప్రైవేట్ వైద్యశాలలో రోగులు, సిబ్బంది, వైద్యులు బయటకు పరుగులు తీశారు. ఘటనపై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.

ప్రాణాలకు తెగించి.. మంటలను ఆర్పి

అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. ఏడీఎఫ్ఓ వేణుగోపాల్‌రావు ఆధ్వర్యంలో మూడు ఫైరింజన్లు రెండు గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. హెడ్‌కానిస్టేబుళ్లు మస్తాన్‌రావు, హరిబాబు అతికష్టంపై లోపలికి వెళ్లి ప్రాణాలకు తెగించి మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఘటన స్థలాన్ని డీఎఫ్ఓ వాకా శ్రీనివాసులురెడ్డి పరిశీలించారు. గోదాముకు ఎలాంటి అనుమతుల్లేవని వెల్లడించారు. షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. సుమారు రూ.40 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని సమాచారం. గోదాము పక్కనే ఉన్న ఫర్నిచర్ దుకాణం సైతం పాక్షికంగా దెబ్బతినింది. అక్కడ రూ.మూడు లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని అగ్నిమాపక అధికారులు తెలిపారు.



టిఫిన్ అంగడిలో వడ తీస్తున్న హిమబిందు



ఐరన్ చేస్తున్న శ్రియారెడ్డి



మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న పూజిత



ఓటు వేయాలని కోరుతున్న ఆదిలక్ష్మి

అండగా ఉండాలని కోరుతూ..

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల తరపున వారి కుటుంబ సభ్యులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. తమ వారికి అండగా నిలవాలని ప్రజలను కోరుతున్నారు. నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె హిమబిందు సోమవారం 18వ డివిజన్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఉదయగిరి ఎమ్మెల్యేగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కోడలు శ్రియారెడ్డి జలదంకి పంచాయతీలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సర్వేపల్లి ఎమ్మెల్యేగా కాకాణి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన కుమార్తె పూజిత మనుబోలు మండలంలోని బద్దెవోలు గ్రామంలో ప్రచారం చేశారు. కావలి ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన భార్య ఆదిలక్ష్మి సర్వాయపాళెం పంచాయతీలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

– నెల్లూరు సిటీ/జలదంకి/మనుబోలు/కావలి

ప్రచార పర్వం

క్లుప్తంగా

యువకుడి హత్య



రవితేజ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): స్నేహితుడిని కొడుతుండగా అడ్డుకోబోయిన ఓ యువకుడు హత్యకు గురైన ఘటన నెల్లూరు నగరంలో ఆదివారం అర్ధరాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన షాజిద్, దళితవాడకు చెందిన రౌడీషీటర్ బాలాజీకి పాతగొడవలున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం రాత్రి షాజిద్ తన స్నేహితుడు సుల్తాన్‌తో కలిసి జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో మద్యం తాగుతున్నాడు. బాలాజీ బైక్‌పై అటువైపు వెళ్లడాన్ని వారు గమనించి అడ్డుకుని అతడిపై దాడి చేశారు. గాయాలపాలైన బాలాజీ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని సోదరుడైన రౌడీషీటర్ చంద్రతోపాటు తన వారికి తెలియజేశాడు. అందరూ కలిసి జాకీర్‌హుస్సేన్‌నగర్‌కు వెళ్లి షాజిద్‌పై దాడికి పాల్పడ్డారు. అదే ప్రాంతం ఐదో వీధికి చెందిన పెయింటర్ జి.రవితేజ (24) షాజిద్ స్నేహితులు. స్నేహితుడిపై దాడి చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న రవితేజ ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అడ్డుకొనే ప్రయత్నం చేశాడు. ఈక్రమంలో వారు అతని తలపై కర్రతో బలంగా కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న నవాబుపేట ఇన్‌స్పెక్టర్ ఎం.బాబీ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి తండ్రి శేషాద్రి ఫిర్యాదు మేరకు నిందితులపై హత్య కేసు నమోదు చేశారు. జీజీహెచ్‌లో సోమవారం ప్రభుత్వ వైద్యులు రవితేజ మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు. ఇన్‌స్పెక్టర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 138
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 244
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 274
లేయర్ చికెన్	: 145



నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	: రూ.100
సన్నవి	: రూ.90
పండ్లు	: రూ.80

అందరికీ మేలు చేసేలా వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ప్రచారంలో పాల్గొన్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలందరికీ మేలు చేసేలా ఉందని, చేయగలిగిన వాటినే అందులో పెట్టినట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పాట్టింపాడు, బ్రహ్మదేవి, పిడతాపోలూరు పంచాయతీల్లోని గ్రామాల్లో సోమవారం కాకాణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనిఫెస్టో ప్రకటన తర్వాత కూడా జగన్‌పై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. అందువల్లే సభలకు పోటెత్తుతున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఎన్ని హామీలిచ్చినా ప్రజానీకం నమ్మే పరిస్థితి లేదన్నారు. సర్వేపల్లిలో టీడీపీ అభ్యర్థి సోమిరెడ్డిపై హ్యాట్రిక్ విజయం సాధిస్తానని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతో ఆయన సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తున్నట్లు విమర్శించారు. టీడీపీ నాయకులు తాము గెలిచిపోతున్నట్లు ప్రచారం చేసుకుంటూ అందుబాటులో ఎవరుంటే వారికి కండువాలు వేసి లెక్కలు చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పేదలు తమ వెంటే ఉన్నారని, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలే తమకు శ్రీరామరక్షగా పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గండవరం సుగుణమ్మ, జెడ్పీటీసీ బందెల వెంకటరమణయ్య, సర్పంచ్ రాజకుమారి, పార్టీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పోలిరెడ్డి చినపరెడ్డి, పల్లంరెడ్డి జనార్దనరెడ్డి గంటా సుబ్రహ్మణ్యం, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

ప్రజలే నా బలం : ఆదాల



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు సిటీ: 'నేను ఎంతో నమ్మిన ఒకరు నమ్మకద్రోహం చేసి వెళ్లిపోవడం చాలా బాధగా ఉంది. ఒకరిద్దరు స్వార్థపరులు వెళ్లినంత మాత్రాన వైఎస్సార్‌సీపీకి వచ్చే నష్టం ఏమీ లేదు. ప్రజలే నా బలం' అని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. రూరల్ మండలంలోని దొంతాలి గ్రామ పంచాయతీలో దొంతాలి, నాంచారమ్మ గిరిజన కాలనీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఆదాల ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి వెన్నుపోటు పొడిచి వెళ్లిన వారికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. దొంతాలిలో సమష్టిగా పనిచేసి వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. తనకు అండగా నిలబడిన ప్రతి ఒక్కరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల అనంతరం అభివృద్ధి పనులు చేస్తామన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ స్రవంతి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి, నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, హరిబాబు యాదవ్, మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, చండి సురేష్, చండి శేఖర్, చండి శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ పథకాలు

- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఎన్నికల ప్రచారం చేస్తున్న రామిరెడ్డి

కావలి: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదు సంవత్సరాల పాలనలో ప్రతి కుటుంబానికి ఏదో ఒక సంక్షేమ పథకం అందినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని 40, 39, 37, 33, 32, 34 వార్డుల్లో సోమవారం ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధి కోసం జగనన్న అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పేద పిల్లల భవిష్యత్ బాగుండాలని ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చివేసినట్లు చెప్పారు. ఈ ఐదు సంవత్సరాలు ప్రతి గడపకు వెళ్లి ప్రజలతో మమేకమైనట్లు తెలిపారు. సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేశానన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను పేదలకు అందించామన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు సులువుగా అందేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చెప్పింది చేశాం.. ఓట్లు అడుగుతున్నాం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

సోమశిల: ఐదేళ్లలో చెప్పింది చేశాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతున్నామని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. బొమ్మవరం అగ్రహారంలో సోమవారం ఎన్నికల ప్రచారం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. 2019లో మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను జగనన్న నెరవేర్చారన్నారు. వచ్చే ఐదేళ్లలో మరింత సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు మేనిఫెస్టో ప్రకటించారన్నారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ హబ్ ఏర్పాటుతోపాటు అభివృద్ధి పనులు చేస్తామన్నారు. ప్రజల మద్దతు వైఎస్సార్‌సీపీకే ఉందన్నారు. ఆయన వెంట ఎంపీపీ పెయ్యల సంపూర్ణమ్మ, నాయకులు ఊరిబిండి ప్రభాకర్‌రెడ్డి, అక్కలరెడ్డి అంకిరెడ్డి, బట్రెడ్డి జనార్దనరెడ్డి, నారాయణరెడ్డి, బొమ్మవరం సర్పంచ్ లక్ష్మీదేవి ఉన్నారు.

ప్రసన్న సమక్షంలో 40 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

విడవలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులకు ఆకర్షితులై బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని కట్టుబడిపాళెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు లక్ష్మయ్య సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయన ఆధ్వర్యంలో 40 కుటుంబాలు కూడా టీడీపీని వీడగా గాదెలదిన్నెలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం మండలం నాయకులు భరత్, మోహన్, కౌన్సిలర్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కందుకూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బుర్రా



ప్రచారం చేస్తున్న మధుసూదన్ యాదవ్

కందుకూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తానని, ఎన్నికల్లో తనను గెలిపించాలని వైఎస్సార్‌సీపీ కందుకూరు అసెంబ్లీ అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. స్థానిక 18, 24వ వార్డుల్లోని పాతబ్యాంకు బజార్, పొట్టి శ్రీరాములు బొమ్మ సెంటర్, పామూరు రోడ్డు, గ్యాస్ గోడౌన్ ప్రాంతాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం హయాంలో నేతలు వ్యాపారులను బెదిరింపులకు గురిచేసిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. అలాంటి సమస్యలు లేకుండా వ్యాపార వర్గాలకు అండగా ఉంటానంటూ హామీ ఇచ్చారు. అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. శాంతిభద్రతలను పరిరక్షించి స్వేచ్ఛాయుత వాతావరణం ఉండేలా చూస్తానన్నారు.

జగన్ పాలనలోనే ముస్లింలకు న్యాయం

- కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్



మాట్లాడుతున్న హఫీజ్ ఖాన్, చిత్రంలో ఖలీల్ అహ్మద్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే ముస్లింలకు అన్ని విధాలా న్యాయం జరిగింది. చంద్రబాబు నాయుడు ఓట్ల కోసం ముస్లింలపై కపటప్రేమ చూపిస్తున్నారు' అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. నగరంలోని 42, 4, 52, 43 డివిజన్లలో సోమవారం ఆయన నెల్లూరు సిటీ అభ్యర్థి ఖలీల్ అహ్మద్‌తో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హఫీజ్ మాట్లాడుతూ ముస్లింల రిజర్వేషన్లపై బీజేపీ నేతలతో మాట్లాడే ధైర్యం ఉందా అని చంద్రబాబును ప్రశ్నించారు. 14 ఏళ్లపాటు సీఎంగా చేసిన ఆయన ముస్లింల కోసం ఏమీ చేయలేదన్నారు. ఏ ముఖం పెట్టుకుని ఇప్పుడు ఓట్లు అడుగుతున్నావని ప్రశ్నించారు. ముస్లింల ఓట్ల కోసం అబ్దుల్ కలాంను రాష్ట్రపతిని చేశానని చంద్రబాబు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. టీడీపీ అభ్యర్థి నారాయణ తన వ్యాపారులను చూసుకోవడం తప్ప ప్రజలకు సేవ చేసే పరిస్థితి లేదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు షేక్ కరిముల్లా, పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష, పార్టీ నగరాధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి, ఆనం జయకుమార్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.